కడపను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- నగరంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం
- స్వచ్ఛందంగా పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: కడప నగరాన్ని ఆరోగ్యకరమైన స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. కడప పాత బస్టాండ్ ఆవరణలో నగర కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంజద్‌బాషాతోపాటు నగర మేయర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ శ్రమదానం చేసి చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ దేశ ప్రధాన నరేంద్రమోదీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థగత రంగాల్లో అమలుచేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క గంటపాటు స్వచ్ఛందంగా వారి పరిసరాలను శుభ్ర పరచడం జరిగిందన్నారు. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కోట్లాది రూపాయల నిధులు అందిస్తున్నారన్నారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా వారి పరిసరాలను వారు శుభ్రం చేసుకుంటే నగరం ఆహ్లాదంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కడప రైల్వే స్టేషన్‌లో...

కడప కోటిరెడ్డిసర్కిల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. కడప రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవ-ఏక్ తారీఖ్ ఏక్ ఘంట కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ స్టేషన్‌లో తడిచెత్తను కంపోస్టు చేసి పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు చంద్రశేఖర్, శేఖర్ కుమార్, రాధాకృష్ణయ్య, డాక్టర్ శ్రీనివాసులు, కాత్యా కుమార్, యూనియన్ నాయకులు మధుసూదన్‌రావు, వెంకట్రామిరెడ్డి, చిన్నపరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని ఆశయం ఉదాత్తమైనది

కడప కల్చరల్: స్వచ్ఛ భారత్‌ను దేశ ప్రజల సంస్కృతిలో భాగంగా మార్చాలన్న ప్రధాని ఆశయం ఉదాత్తమైనదని ఎల్‌ఐసీ ఎస్‌డీఎం కె.గిరిధర్ అన్నారు. ఎల్‌ఐసీ కార్యాలయ కాంప్లెక్స్‌లో ×స్వచ్ఛతా హీ సేవ× కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ 32 కోట్ల మంది భారతీయుల్ని ప్రధాని సామూహిక ఉద్యమంలో భాగస్వాములను చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు ఎల్‌ఐసీ ఉద్యోగులు తాము భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారన్నారు. అనంతరం ఆయనతోపాటు ఉద్యోగులు డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో పిచ్చిమొక్కలు, చెత్తా,చెదారం తొలగించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్ రావు, సత్యప్రసాద్, సత్య శ్రీనివాస్, ఆనందరావు, శ్రీనివాస్, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

స్థానిక అక్కాయపల్లె 46వ డివిజన్ శాస్త్రీనగర్‌లో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పిలుపుమేరకు కడప నగరాన్ని ఆరోగ్యకరమైన స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో శ్రమదానం

కడప కార్పొరేషన్: కడపను పరిశుభ్ర నగరంగా తయారుచేయాలని 25వ డివిజన్ కార్పొరేటర్ కె.సూర్యనారాయణరావు, పత్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు జైచంద్రరెడ్డిలు అన్నారు. శంకరాపురంలోని విద్యుత్ భవన్ వద్ద ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో స్వచ్ఛభారత్ కింద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ నెలకోకసారి చేస్తే పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. పోలిమేర గోపాల్‌రెడ్డి, అజ్జుల్లా, హరి, డిల్లీశ్వరరావు, కన్యాకుమారి, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

శిశుగృహలో...

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం కొండాయపల్లెలో ఉన్న శిశు గృహలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాలను ఆదివారం శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

భారతీయ జనతా పార్టీ సేవా పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా ఏక్ తారిఖ్ ఏక్ ఘంటా నినాదంతో కడప నగరంలోని పాత బస్టాండు, మున్సిపల్ హైస్కూల్(మెయిన్) ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్, శ్రీనాథ్‌రెడ్డి, కల్యాణ్, లక్ష్మణ్‌రావు, రామకృష్ణారెడ్డి, మునగా సతీష్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో వైద్యుల స్వచ్ఛభారత్

కడప అర్బన్: నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో వైద్యులు, వైద్య విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడికి ఊరట

కిలో టమాట రూ.12, బెండకాయ కిలో రూ.15

కడప అగ్రికల్చర్: కూరగాయల ధరలు కొండ దిగి వచ్చాయి. అందుబాటు ధర ఉండడం వినియోగదారులు ఊరటనిస్తోంది. మొన్నటి వరకు అధిక రేట్లు పలికిన టమాటా ధర ప్రస్తుతం కిలో రూ.12కు చేరింది. కిలో రూ.250 ఉన్న అల్లం ధర ప్రస్తుతం రూ.120 పలుకుతోంది. వీటితోపాటు పలు కూరగాయల ధరలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. కడప రైతు బజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయల ధరలు రూపాయలలో	
టమాట	12
బెండకాయ	15
క్యాబేజీ	20
మట్టికాయ	20
కాకరకాయ	20
వంకాయ	20
మిరపకాయ	25
దొండకాయ	24
బీరకాయ	30
క్యారట్	40
బంగాళదుంప	40
బీట్రూట్	40
కాలీఫ్లవర్	45
అలసందలు	50
బీన్స్	65
అల్లం	120

క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



ముదిరెడ్డి శోభారాణి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిశోధకురాలు ముదిరెడ్డి శోభారాణికి విశ్వవిద్యాలయం ఆదివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగు శాఖ ఆచార్యులు డా.పాలెం రమాదేవి పర్యవేక్షణలో రెండు దశాబ్దాల రాయలసీమ కథా సాహిత్యం – గ్రామీణ జీవితం (1991–2010) అంశంపై ఆమె చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ దక్కిందని వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వర రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పెద్దముసల్‌రెడ్డిపల్లెకు చెందిన ఈమె 2018లో యూజీసీ జేఆర్ఎఫ్ ద్వారా పీహెచ్‌డీలో ప్రవేశం పొందారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడమేగాక 20కిపైగా పరిశోధన వ్యాసాలను రాశారు. వైవీయూ అధికారులు, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

వార్డెన్ల నియామకం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలకు 9 మంది నూతన వార్డెన్లను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. నియమితులైన వారిలో డా. బి. శ్రీనివాసరెడ్డి(అప్లైడ్ మ్యాథమాటిక్స్), డా. పి.వి.వరప్రభాకర్(బిజినెస్ మేనేజ్‌మెంట్), డా. ఎస్.రామమనోహర్‌రెడ్డి(నానో టెక్నాలజీ), డా. డి.ఆర్.సతీష్‌బాబు (పొలిటికల్‌సైన్స్), డా. ఎం.రాఘవేందర్ (ఫిజిక్స్), డా.ఎస్. సునీత(అప్లైడ్ మ్యాథమాటిక్స్), డా.ఎస్.సుమిత్ర (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్), డా. వి.అనుప్రసన్న (జువాలజీ), డా. జె. మెర్సీవిజేత (ఇంగ్లీషు)లు ఉన్నారు. చీఫ్ వార్డెన్ వద్ద వారంతా రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు.

సామాజిక సేవ చేద్దాం

కడప రూరల్: సామాజిక సేవలతోనే పేదలకు ప్రయోజనం చేకూరుతుందని పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు పేర్కొన్నారు. పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలీ భవన్ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అవ్వారు అర్జున్, రమేష్ రోగులకు వైద్య సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవ్వారు సుబ్బరాయుడు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనపాటి యానాదయ్య, పద్మనాభయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మానసికోల్లాసం

సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

కడప స్పోర్ట్స్: క్రీడల్లో రాణించడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరంలోని పి.వి.ఆర్.స్పోర్ట్స్ ఎరీనాలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా స్థాయి పురుషుల డబుల్స్ విభాగం టోర్నమెంట్–23 ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ క్రీడలకు వయసుతో సంబంధం లేదన్నారు. గెలుపుతో వచ్చే ఉత్సాహం, క్రీడల్లో పాల్గొంటే కలిగే ఆనందం చక్కటి జ్ఞాపకాలన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ రోజూ సాధన చేసే మధ్య వయసు క్రీడాకారులకు ఈ టోర్నమెంట్లు ఎంతో ఉత్సాహాన్నిస్తాయన్నారు. పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు స్పోర్ట్స్ ఎరీనాను వినియోగించుకుని ఉత్తమ శ్రేణి క్రీడాకారులుగా రాణించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్: 80 ఏళ్ల దాటిన వృద్ధులను సన్మానించడం అభినంద నీయమని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలోని బుద్ధాయిపల్లె సచివాలయంలో 80 ఏళ్లు దాటిన 15 మంది సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

15 నుంచి నవరాత్రి వేడుకలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

కడప కల్చరల్: ఈ నెల 15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్ తెలిపారు. స్థానిక వాసవీ కన్యకాంబ ఆలయంలో బ్రోచర్లకు అమ్మవారి సన్నిధిలో పూజలు చేయించిన అనంతరం అర్చకులు, ఉత్సవాల నిర్వహణ కమిటీ, ఇతరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు.

నగరంలో పోలీసుల తనిఖీలు

కడప అర్బన్: కడప నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహించారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతకడప, మోడమీదపల్లె గ్రామాల్లో సీఐ పి.నరసింహారెడ్డి, ఎస్ఐ పి.రవికుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. వన్‌టౌన్ పరిధిలో సీఐ ఎస్.వి.నాగరాజు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి గుర్రాలగడ్డ ప్రాంతంలో, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ సయ్యద్ హాసం తన సిబ్బందితో కలిసి మాసాపేటలో తనిఖీలు చేపట్టారు.



మాసాపేటలో తనిఖీలు చేస్తున్న టూటౌన్ సీఐ సయ్యద్ హాసం

పేదలకు సేవలందించడం అభినందనీయం



ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖ్య అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో పేదలకు మెరుగైన సేవలదించడంలో ఫాతిమా మెడికల్ కళాశాల చూపుతున్న చొరవ అభినందనీయమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఫాతిమా మెడికల్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి పీజీ వైద్యుడు మారుమూల ప్రాంతాలకు వెళ్లి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఏటా 100 మంది ఎంబీబీఎస్, 25 మంది పీజీ వైద్యులను సమాజానికి అందించడం ఆనందంగా ఉందన్నారు. తిరుపతి స్విమ్స్ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ బీసీఎం.ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిని చూసి తాము గర్విస్తున్నామన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ, డైరెక్టర్ జయరామిరెడ్డి, ఓబులేశు, సల్మాన్ ముర్తాజా, ఐహెచ్ ఫరూఖ్, రామమనోహర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్య హేళ



కడప కల్చరల్ : ఆటవిడుపు కార్యక్రమంలో కడప శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల నృత్యం అద్భుతం ఆకట్టుకుంది. నృత్య గురువు విజయశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేసి వారిని ప్రోత్సహించారు. ఈ ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కడప కోటిరెడ్డిసర్కిల్/చెన్నూరు: నగర శివారులోని చెన్నూరు మండలానికి చెందిన 80 మంది యువకులు బీజేపీలో చేరినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, ఏపీ స్టేట్ సెక్రటరీ బాలకృష్ణ యాదవ్, అనంతపురం ఇన్‌ఛార్జి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. బీజేవైఎం నాయకులు చెన్నూరు ప్రతాప్‌రెడ్డి, భరత్‌రెడ్డి, బత్తల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి బీజేపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన కాశీ, బాలాజీ, ఖాజా, శివారెడ్డి, కాశీ విశ్వనాథ్, రాజాప్రతాప్, రాజేష్, శ్రీకాంత్‌వర్మ, గోపి, రవి, నవీన్, శ్రీను, చరణ్, లక్ష్మయ్య తదితరులకు బీజేపీ కండువాలు వేసి వారు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మన విజయ్ పాల్గొన్నారు.

అక్టోబర్1ని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినంగా ప్రకటించాలి

ప్రొద్దుటూరు: అక్టోబర్ 1వ తేదీని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోకన్వీనర్ ఎస్‌పీ మహమూద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం ఏర్పడాలనే లక్ష్యంతో పొట్టి శ్రీరాములు పోరాటం చేశారని, దాని ఫలితంగా 1953 అక్టోబర్, 1న మద్రాసు నుంచి విడిపోయి కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, బషీర్, జగదీష్, ఇస్మాయిల్, దర్బార్ బాషా, శ్రీను, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పొగతాగడంతోనే గుండె జబ్బులు

ప్రొద్దుటూరు కల్చరల్: పొగతాగడంతోనే నాలుగు రెట్లు ఎక్కువగా గుండె జబ్బులు వస్తున్నాయని గుండె జబ్బు వ్యాధి నిపుణుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం గుండె సమస్యలు, జాగ్రత్తలు, పరిష్కారాలు అంశంపై సదస్సు నిర్వహించారు. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారికి గుండె నొప్పి తెలియదన్నారు. రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్ చేయడంతో గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తవ్వా సురేష్, పాలంకి శ్రీరాములు,హేమంత్, దేవమణి, గోపినాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బస్సుల దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని వై-జంక్షన్ వద్ద రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. రాజంపేట, బద్వేల్ వైపు నుంచి వచ్చే పల్లె వెలుగు బస్సులను పాత రూట్‌లో అప్సర థియేటర్ మీదుగా, తిరుపతి వైపు నుంచి వచ్చే బస్సులు మహావీర్ సర్కిల్, న్యూ కలెక్టరేట్, వర్క్‌షాప్, సబ్ జైలు మీదుగా వెళ్తాయన్నారు. కడప నుంచి నెల్లూరు వైపు వెళ్లే బస్సులు పాత బస్టాండు, అప్సర సర్కిల్ మీదుగా, నెల్లూరు నుంచి కడపకు వచ్చేటపుడు సబ్ జైలు, ఆర్టీసీ వర్క్‌షాప్ మీదుగా వెళ్తాయని తెలిపారు.

ఓపీఎస్ కోసం నిరంతరం పోరాటం

ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేసే వరకు పోరాటం చేస్తామని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి పేర్కొన్నారు. కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీపీఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులో ఉద్యోగి పదవీవిరమణ తర్వాత చివరి నెల మూల వేతనంలో 50 శాతం పింఛన్ వస్తుందని, ఉద్యోగి మరణిస్తే కుటుంబం లోని వారికి 60 శాతం పింఛన్ ఇస్తామని మాత్రమే ఉందన్నారు. ఉద్యోగి రిటైర్డ్ అయిన తర్వాత సీపీఎస్‌లో వచ్చే గ్రాట్యుటీ మొత్తం చెల్లిస్తారో లేదో కూడా బిల్లులో లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శులు మదన్‌రెడ్డి, నాగరాజు, సలాం, రవిశంకర్, అయ్యవారురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి

భారతి హాస్పిటల్‌లో అత్యాధునిక సేవలు

కడప కార్పొరేషన్: కడపలో తొలిసారిగా ఏర్పాటుచేసిన భారతి హాస్పిటల్‌లో అత్యాధునిక కంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఆర్టీసీ చైర్మెన్ ఎ.మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక ద్వారకా నగర్‌లో భారతి ఐ హాస్పిటల్ ఇన్‌సైట్ రిఫ్లెక్టివ్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా.శివతేజరెడ్డి, డా.హారిక రెడ్డి కడపలో తొలిసారి అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తేవడం సంతోషదాయకమన్నారు. డా. హారిక రెడ్డి మాట్లాడుతూ ఇన్‌సైట్ రిఫ్లెక్టివ్ సెంటర్ ద్వారా కంటి అద్దాల అవసరం లేకుండానే మెరుగైన కంటి చూపు లభించగలదన్నారు. రెండు కళ్లకు ఆపరేషన్ చేసే సౌకర్యం తమ హాస్పిటల్‌లో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ప్రముఖ కంటి వైద్యులు స్వరూపరాణి, నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్, ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

పుస్తకావిష్కరణ

కడప కల్చరల్: డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి రచించిన స.వెం.రమేశ్ రచనలు – పరిశీలన పుస్తకాన్ని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి రచనా శైలిపై పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ ఎస్.రాజగోపాల్ రెడ్డి, ప్రభాకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు, బంధు మిత్రులు రచయితను సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వరి, గోధుమ నూతన వంగడాలను సృష్టించి దేశంలో ఆకలి బాధలను తీర్చిన శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ అని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి వరి, గోధుమ, బంగాళాదుంప జన్యువులపై పరిశోధనలు చేశారన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్‌తో కలిసి గోధుమ, వరి నూతన వంగడాలను సృష్టించడంలో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, మహేష్, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, మాధవరెడ్డి, సాయికుమార్, బాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జ్యోతుల మహోత్సవం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఆదివారం జ్యోతుల ఉత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో దాదాపు 25 జ్యోతులు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించారు. 3 రోజుల అనంతరం గొడుగుల ఉత్సవాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వేంపల్లె : వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం పేదలకు వరంలాంటిదని వేంపల్లె జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని ఆటోవాలా యజమానులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఆటోవాలాలు పడుతున్న కష్టాలను చూసి అన్ని విధాల ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సొంత ఆటోలు, టాక్సీలు, క్యాబ్ యజమానులకు ఏటా రూ.10వేలు వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా సాయం అందజేస్తున్నారన్నారు. ఆటోవాలా ఖాతాలో డబ్బులు జమకావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహమతుల్లాఖాన్, మాజీ వార్డు మెంబర్ ఖదిరుల్లా సోషల్ మీడియాకు కన్వీనర్ దౌలత్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటోవాలాలు